ప్రజాశక్తి
శుక్రవారం 23 జూన్ 2023
5
విజయనగరం



# మండల ప్రత్యేకాధికారుల మార్పు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పలు మండలాల ప్రత్యేక అధికారులను మార్పు చేస్తూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. రేగిడి ఆమదాలవలస మండల ప్రత్యేక అధికారిగా డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, బొబ్బిలి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదన రావు, బాడంగి మండలానికి డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, సంతకవిటి మండలానికి తోటపల్లి ప్రాజెక్టు భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించారు. ఆయా అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో అధికారులు, సిబ్బందిని సమన్వయ పరుస్తూ ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

# పోలవరం మాదిరిగా పునరామోసం

- టిటిపిఆర్ నిర్వాసితులకు అందని పరిహారం
- పునరావాసానికీ నోచుకోని దుస్థితి

**పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసినట్టే, జిల్లాలోని టిటిపిఆర్ (తారక రామతీర్థసాగర్) ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరిహారం, పునరావాసం.... నిర్వాసితుల పాలిట పరిహాసంగా మారింది. భూములు, ఊళ్లు కోల్పోయిన బాధితులకు దశాబ్దాలు గడిచినా నష్టపరిహారం, పునరావాసం అందని పరిస్థితి. భూసేకరణ విషయంలో పాలకులు 'యేరు దాటే వరకు ఓడ మల్లన్న, ఒడ్డుకు చేరాక బోడిమల్లన్న' అన్న చందంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. దీంతో, నిర్వాసితులంతా నిలువ నీడలేక, వ్యవసాయ భూములకూ దూరమై... బతుకు భారమై తల్లడిల్లుతున్నారు. నిర్వాసిత సమస్యలను అధ్యయనం చేసేందుకు గత ఏడాది జులైలో ఆర్అండ్ఆర్ కమిషనర్ జిల్లాలో పర్యటించినప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.**

తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో నాలుగు మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టిన విషయం విధితమే. పునరావాసానికి ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు అవసరం కానుంది. పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74 కోట్లు అవసరం కానుందని 2016లో అధికారులు అంచనా రూపొందించారు. సకాలంలో నిధులు కేటాయించకపోవడం వల్ల పెరిగిన ధరల నేపథ్యంలో రూ.87కోట్లు వరకూ పెరిగేందుకు అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ. 54.66 కోట్లు వెరసి మొత్తం రూ.204కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమేరకూ సరిపోయే పరిస్థితి లేదు. 2003లో తోటపల్లి నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళ్లు నిర్మించు కోలేకపోయారు. ఇప్పటికీ నిర్వాసిత కాలనీలు మొండిగోడలతోనూ, పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. చట్ట ప్రకారం భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కూడా కోరుతున్నారు. నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామినాయుడువలస వారికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్ వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో అర్అండ్ఆర్ కింద రూ.119.1 కోట్లు అవసరమౌతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇందులో కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే రూ.106.8 కోట్లు అవసరం కానుంది. ఆర్అండ్ఆర్‌కు ప్రభుత్వం కేవలం రూ.3.96కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నేపథ్యంలో సిపిఎం, నిర్వాసిత పోరాట కమిటీల ఆధ్వర్యాన నిర్వాసితులు మరో పోరాటానికి సిద్ధమౌతున్నారు.

### కేటాయింపులు కాదు.. విడుదల చేయాలి

నిర్వాసితులకు ప్రభుత్వం ఏటా కేటాయింపులు చేస్తే సరిపోదు. నిధులు విడుదల చేసి, ఆచరణాత్మకంగా వ్యవహరించాలి. తారకరామ సాగర్‌కు భూములు సేకరించి సుమారు 18ఏళ్ల కావస్తున్నా ఇప్పటికీ పునరావాసం కల్పించకపోవడం, నష్టపరిహారం చెల్లించకపోవడం అన్యాయం. పోలవరం విషయంలో కేంద్రంలోని బిజెపి అనుసరించినట్టే మన జిల్లాలో తారకరామ తీర్థసాగర్ నిర్వాసితుల విషయంలో వైసిపి వ్యవహరిస్తోంది. నిర్వాసితుల తరపున సిపిఎం తొలి నుంచీ పోరాడుతోంది. ఇక ముందూ పోరాడుతుంది.

**- తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి**

### నిధులు రావాల్సి ఉంది

తారకరామ తీర్థసాగర్ పరిధిలో భూములతోపాటు ఇళ్లు కోల్పోయిన వారు 819మంది ఉన్నారు. కేవలం భూములు కోల్పోయినవారు 1398 మంది వరకు ఉన్నారు. వీరందరికీ మొత్తంగా రూ.204కోట్లు కోట్ల మేర రావాల్సివుంది. కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీచేసింది. లబ్ధిదారులకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా వచ్చింది. నిధులు విడుదల కావడమే తరువాయి. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 20 గ్రామాలకుగాను 13గ్రామాలను తరలించి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాం. మిగిలిన ఏడు గ్రామాలకు ఇంకా పునరావాసం కల్పించాల్సివుంది. అప్పట్లో మంజూరు చేసిన రూ.58వేలు సరిపోవని, ఇప్పటి ధరలకు అనుగుణంగా కనీసం రూ.3లక్షల చొప్పున ఇవ్వాలని వారు అడుగుతున్నారు.

**- సుగుణాకరరావు, టిడిపిఆర్ ఎస్ఇ**

# మహిళలకు అన్యాయం చేస్తే సహించం

- అక్రమార్కులను తక్షణమే అరెస్టు చేయాలి
- మృతురాలి కుటుంబ బాధ్యత ప్రభుత్వానిదే
- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బలివాడ ప్రభావతి

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

డ్వాక్రా మహిళలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి స్పష్టం చేశారు. మండలంలోని కల్లేపల్లి పంచాయతీలో బుక్ కీపర్ గాడి చిన్నతల్లి మరో బుక్ కీపర్ గోకాడ మహేశ్వరిని హత్య చేసి జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. డ్వాక్రా మహిళా సంఘాల డబ్బులు లూటీ చేయడమే ఈ హత్యకు కారణమని తెలుసుకున్న బ్యాంకర్లు తమకు డబ్బులు చెల్లించాలని డ్వాక్రా మహిళలకు నోటీసులు పంపించారు. ఈ విషయంపై ఆందోళన చెందిన మహిళలు ఐద్వాను ఆశ్రయించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.రమణమ్మ ఆధ్వర్యాన గురువారం కల్లేపల్లిలో డ్వాక్రా సంఘాల సమస్యపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలను మోసం చేసి డబ్బు కాజేసిన వారిని తక్షణమే అరెస్టు చేయడమే కాకుండా హంతకురాలు గాడి చిన్నతల్లిపై మరో మోసపూరిత కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హత్య కేసు బయటపడటంతో ఇప్పుడా మహిళలకు నోటీసులు పంపుతారని ఎపిజివిబి సిబ్బందిపై మండిపడ్డారు.

అధికారులకు తెలియకుండానే 48 గ్రూపులకు చెందిన సుమారు రూ.70 లక్షలు డ్వాక్రా సొమ్మును కాజేశారా? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన ఎపిజివిబి కొత్తవలస బ్రాంచ్ మేనేజర్, వైకెపి సిసి ఈశ్వరరావుపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీ నిధి డబ్బులతోపాటు డ్వాక్రా రుణాల్లో కూడా అక్రమాలు జరిగాయన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఒక్క పైసా కూడా చెల్లించరని తెగేసి చెప్పారు. చిన్నతల్లి అక్రమ ఆస్తులను జప్తు చేసి డ్వాక్రా రుణాల బాకీలు తీర్చాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. గోకాడ మహేశ్వరి పిల్లలను ప్రభుత్వమే చదివిస్తూ... కుటుంబ బాధ్యత వహించాలన్నారు. త్వరితగతిన వీరికి న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.రమణమ్మ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి త్వరలో డిఆర్‌డిఎ పీడీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి యండమూరి సత్యవతి మాట్లాడుతూ గడిచిన 10 నెలల్లోనే డ్వాక్రా గ్రూపులలో అవినీతి జరిగిందని మండిపడ్డారు. వారం రోజులలో సమస్యను పరిష్కరిస్తామన్న జిల్లా అధికారులు ఇంతవరకు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి డి.కరుణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు , జి.సునీత, ఎ.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

**కమిటీ ఏర్పాటు**

రానున్న రోజుల్లో ఉద్యమానికి పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బి.కరుణ , అధ్యక్ష , కార్యదర్శులుగా అనిమిరెడ్డి సత్యవతి, గురు సునీత, ఉపాధ్యక్షులుగా ఆర్.రమాదేవి , సహాయ కార్యదర్శులుగా జె.రమణమ్మ, బి.అప్పలనర్సమ్మ, జి.మణి, సభ్యులుగా బి.ముత్తువమ్మ, జి.వరలక్ష్మి, ఎం.వరలక్ష్మి, ఎం.దేముళ్ల తదితరులతో కమిటీని ఏర్పాటుచేశారు.

అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

# నిజమైన దళిత పక్షం కమ్యూనిస్టులే

- అయ్యప్ప నగర్‌లో అక్రమ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయాలి
- దళిత, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యప్ప నగర్‌లో పూసర్ల మధు నిర్వహిస్తున్న అక్రమ వాటర్ ప్లాంట్ వలన స్థానికుల ఇళ్లల్లో బోర్లు ఇంకిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటర్‌ప్లాంట్‌ను సీజ్ చేయాలని దళిత, ప్రజాసంఘాల ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. వాటర్‌ప్లాంట్‌ను మూసివేయాలని పోరాడుతున్న వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ అధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ అక్రమ ప్లాంట్ ను రక్షించు కునేందుకు పూసర్ల మధు తన భార్యతోను, బావ మరిది తోనూ తప్పుడు కేసులు పెట్టారని, వీటిని తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది దళిత సంఘాల పేరుతో అక్రమ వాటర్ ప్లాంట్ యాజమాని పూసర్ల మధుతో కలసి సిపిఎం, ప్రజాసంఘాల నాయకులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. నిజమైన దళితుల పక్షం కమ్యూనిస్టులు మాత్రమేనని అన్నారు. కొవ్వాడ దళిత సంఘాల నాయకులు దేబార్కి అప్పారావు మాట్లాడుతూ పూసపాటి రేగ మండలం కొవ్వాడ దళితులకు అండగా సిపిఎం నిలబడి పోరాడ బట్టే పెత్తందార్ల నుంచి భూములు దళితులకు దక్కాయంటే పోరాటమే కారణమని అన్నారు.

మహిళా నాయకులు ఏకలమ్మ మాట్లాడుతూ బొగ్గులదిబ్బ లో పేదల పాకాలను తొలగిస్తే దళితుల తరపున నిలబడింది సిపిఎం మాత్రమేనని అన్నారు. విఆర్ఎల సంఘం జిల్లా కార్యదర్శి బచ్చల సూర్యనారాయణ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు , పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వేపాడ దళిత సంఘాలు నాయకులు రిక్కి అప్పరావు, ఎస్.కోట మండల దళిత నాయకులు కప్పరెడ్డి వెంకట అప్పారావు, డెంకాడ మండల దళిత నాయకుల నిడిగంటి సూర్యనారాయణ, ఎస్.కోట సివరంపురం దళిత నాయకులు మొయ్యి వెంకటరమణ, జొన్న గుడ్డు, రామకృష్ణానగర్ నాయకులు బలగ మోహన్, గంజిపేట దళత సంఘాల నాయకులు బలగ మోహన్, గంజిపేట, దళిత నాయకులు నూకమ్మ , కనపాక దళిత మహిళా నాయకులు వసంత గౌరి, దళిత విద్యార్థి విభాగం నాయకుడు ముళ్ళ హర్ష, తది తరులు పాల్గొన్నారు, దళిత సంఘాలకు, సిపిఎంకు మధ్య తగాదాలా అధికారులు చోద్యం చూడడం సరైనది కాదన్నాన్నారు. తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని తెలిపారు.

# గడువులోగా నిర్మాణం పూర్తిచేయాలి

## వైద్య కళాశాల పనులపై కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని గాజులరేగ వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణంలో భాగంగా చేపట్టిన వివిధ రకాల నిర్మాణ పనులను, ఇంజినీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వైద్య ఆరోగ్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణం పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సామాగ్రిని సమీకరించాలని నిర్మాణ సంస్థకు సూచించారు. వైద్య కళాశాల నిర్మాణం పనుల పురోగతిని తెలుసుకునేందుకు కలెక్టర్ గురువారం కళాశాలను సందర్శించారు. వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎస్ఇ అంకమ్మ చౌదరి, ఇఇ బిఎన్ ప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు నిర్మాణం పనులు జరుగుతున్న తీరును వివరించారు. పెయింటింగ్, తరగతి గదుల్లో సీట్ల ఏర్పాటు పనులు, సీలింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్టు వివరించారు. విద్యుదీకరణ, వైరింగ్, తాగునీటి పైప్‌లైన్లు, ఆడియో వీడియో పరికరాల ఏర్పాటు వంటి అంశాలపైన కలెక్టర్ తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, హాస్టల్ బ్లాక్‌ల నిర్మాణం గడువులోగా పూర్తిచేస్తామని ఎస్ఇ, ఇఇలు వివరించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదుల్లో జరుగుతున్న ఫర్నిచర్ ఏర్పాటు, ల్యాబ్‌ల పనులను కలెక్టర్ పరిశీలించారు. కళాశాల వరకు రోడ్డు నిర్మాణంపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందిస్తున్నట్టు ఇఇ ప్రసాద్ తెలిపారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, వైద్య కళాశాలకు చెందిన పలువురు వైద్యులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

### శరవేగంగా సిద్ధమవుతున్న వైద్య కళాశాల

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్న తరుణంలో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒకవైపు గోడలకు పెయింటింగ్ పనులు, మరోవైపు భవనం లోపల అవసరమైన ఇంటీరియర్ పనులు నిరంతరాయంగా జరుగుతున్నాయి. జూలై 15వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులను మోహరించి పనులు చేపడుతున్నట్టు ఇఇ బి.ఎన్.ప్రసాద్ తెలిపారు.

# నేటి నుంచి జగనన్న సురక్ష

## జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న సురక్ష బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న జెడ్‌పి చైర్మన్

జగనన్న సురక్ష కార్యక్రమం అమలును జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 23 నుంచి జగనన్న సురక్ష క్యాంప్ అనే నూతన కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి ప్రభుత్వ, పార్టీ యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపించి 9అంశాలతో కూడిన ప్రభుత్వ పత్రాలను ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ, కుటుంబ ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ, లావాదేవి మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్ కు ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజలు పొందవచ్చునని తెలిపారు. జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో జిల్లా అధికార యంత్రాంగం, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బస్సు యాత్రకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ ఇచ్చిన హామీలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు నిర్వహిస్తున్న బస్సు యాత్ర కార్యక్రమం గురువారం పాయకరావుపేట నియోజకవర్గం పాయకరావుపేటలో సాగింది. విజయనగరం ఉమ్మడి జిల్లా నాయకులు పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు , గుమ్మిడి సంధ్యారాణి , మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, నియోజకవర్గ ఇంఛార్జులు, డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి తదితరులు హాజరయ్యారు.

# బిసిల ద్రోహి మోడీ

## బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు చట్టబద్దంగా కల్పించాలని బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం మారేష్ డిమాండ్ చేశారు. బిసిల ద్రోహిగా మారి ప్రధాని మోడీ చరిత్ర హీనుడు కావద్దని అన్నారు. గురువారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్న బిసి ల పరిస్తితి అధ్వానంగా ఉందన్నారు. బిసి ప్రధాని మంత్రి మోడీ బిసిలకు న్యాయం చేస్తాడని,50 శాతం రిజర్వేషన్ కల్పిస్తారని అసించాం కానీ జరగలేదని అన్నారు. రాజకీయ రిజర్వేషన్లు వస్తేనే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు అన్నారు. సర్పంచ్ నుంచి అన్ని పదవుల్లో బిసిలకు అగ్ర స్థానం ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిది అని అన్నారు. విద్యా,వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. త్వరలో బిసి ల బిసి గర్జన సభను చేపడుతున్నా మన్నారు. వెనుకబడిన కులాలను చిన్న చూపు చూసున్న చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా బిసి మహిళా సంఘం అధ్యక్షులుగా అంపోలు సుధారాణిని నియమిస్తూ నియమయక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బేబిరాణి, జిల్లా కన్వీనర్ బొద్దాన అప్పారావు, ఉత్తరాంధ్ర ఇంఛార్జి గదుల సత్యలత తదితరులు పాల్గొన్నారు.

# బడిబస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-వేపాడ

జిల్లాలో పాఠశాలల విద్యార్థులకు బడి బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గురువారం కలెక్టరేట్‌లోని ఫిర్యాదుల విభాగంలో తమ్మినేని ఆధ్వర్యాన సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు వినతి అందించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించి రెండో వారం నడస్తున్నా ఇంతవరకూ బడిబస్సులను నడపకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. దూరప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పది రోజుల్లో జిల్లా వ్యాప్తంగా బడిబస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో భారీఎత్తున కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# 'శ్రీచైతన్య'లో పుస్తకాల విక్రయాలు

- అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు
- సీజ్ చేసిన ఎంఇఒ లక్ష్మణరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

పుస్తకాలు విక్రయిస్తున్న గదిని సీజ్ చేస్తున్న ఎంఇఒ లక్ష్మణరావు

బొబ్బిలి పట్టణంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు యూనిఫాం, పుస్తకాలను అమ్ముతున్నారు. గురువారం ఈ విక్రయాలను ఎస్ఎఫ్ఐ నాయకులు కె.మణికుమార్, కె.డేవిడ్, బి.తేజ, కె.శ్రీను, ఎన్.కోటి అడ్డుకున్నారు. విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎంఇఒ చల్లా లక్ష్మణరావు పాఠశాలకు చేరుకొని పుస్తకాలున్న రెండు గదులను సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఇఒ లక్ష్మణరావు హెచ్చరించారు.

**శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేయాలి**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్న శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి పుస్తకాలు, యూనిఫాం అధిక ధరలకు విక్రయించడం అన్యాయమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన శ్రీచైతన్య స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో

# మౌలిక సౌకర్యాలు కల్పించాలి

**డివిఇఒ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం డివిఇఒ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అడిగినా, ప్రభుత్వ అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంతో చాలామంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని తెలిపారు. కళాశాలలో ఇద్దరు మాత్రమే ప్రభుత్వ అధ్యాపకులు ఉండటం వలన విద్యార్థులకు క్లాసులు నిర్వహించడం ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. గతంలో ఈ సమస్యల పై విద్యశాఖ మంత్రి స్పందించి హామీ ఇచ్చిన ఎటువంటూ పనులు జరగలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకుంటే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయకార్యదర్శులు జె.రవికుమార్, ఎం.సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు రమేష్ ,రాజు ,లావణ్య, సమీరా, నాయకులు సోమేశ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**ఇన్ని సమస్యలతో చదువులు ఎలా?**

**గజపతినగరం :** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టి, తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు గత సంవత్సరం నుండి పాఠ్యపుస్తకాలు రాలేదన్నారు. వెంటనే పాఠ్య పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆర్ఒ ప్లాంట్ వెంటనే తెరిచి, మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఒక గదిని రెండు భాగాలుగా చేసి తరగతుల నిర్వహిస్తున్నారని చెప్పారు. నాలుగేళ్ల డిగ్రీ విధానాన్ని రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వినయ్, లక్ష్మణరావు, రాము మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

డివిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

## సైన్స్ అవార్డులను రద్దు చేయడం..

# శాస్త్ర పురోగతికి అడ్డుకట్టే : జెవివి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సైన్స్ అవార్డులను రద్దు చేయడమంటే శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమేనని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి పి.రమణప్రభాత్ అన్నారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపి వేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ తీసుకున్న నిర్ణయం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యువ శాస్త్రవేత్తలకు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను రద్దు చేయడం అంటే వారు తమ రంగాలలో చేసిన కృషికి కనీస గుర్తింపు లేకుండా వారిని అవమానించడమేనని అన్నారు. ఇలాంటి చర్యల ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకొని తాము చెప్పినట్లు వినే కీలుబొమ్మని చేయాలనేదే కేంద్ర ప్రభుత్వం ఆలోచనని విమర్శించారు. ఇప్పటికే భారత ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నడుస్తున్న విజ్ఞాన్ ప్రసార్ సంస్థను భారత ప్రభుత్వం మూసేయాలనే నిర్ణయం తీసుకుందని, మరి ఇలాంటి చర్యలు పాలకులు తీసుకుంటూ దేశం ప్రగతి పథాన నడుస్తోందని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియపరచకూడదనే భావన పాలకులలో రావడం, మరోవైపు అశాస్త్రీయ అంశాలైన జ్యోతిష్యం, వాస్తు మొదలగు అంశాలను పాఠ్యాంశాలలో చొప్పించడం తిరోగమన చర్యకు నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు క్రమబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా శాస్త్రీయతను దూరంచేసి వాటి స్థానంలో తమ భావాజాల, సైద్ధాంతికను అందించాలనే విషవిద్వేష రాజకీయ ఆలోచనలో భాగంగానే సైన్స్ అవార్డుల రద్దు జరిగిందనే విషయం ప్రజలు గుర్తించాలని అన్నారు. ఇలాంటి చర్యలను మేధావులు, శాస్త్రవేత్తలు, శాస్త్ర ప్రచార సంస్థలు ఖండించాలని జనవిజ్ఞాన వేదిక విజ్ఞప్తి చేస్తోందని అన్నారు.

## పోర్టల్‌లో షుగర్, బిపి వ్యాధిగ్రస్తుల వివరాలు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహిస్తున్నపుడు వచ్చిన ప్రతి ఒక్కరికి బిపి, షుగర్, కేన్సర్ వంటి వ్యాధులను గుర్తించి, వివరాలను ఆయా యాప్ లలో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గురు వారం డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కర్ రావుతో కలిసి వైద్యాధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గర్భిణీ, బాలింతలు, కిషోర బాలలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, ఎన్ సి డి సి డి సర్వే, మాతా శిశు మరణాలు తదితర అంశాల పై పిహెచ్‌సి వారీగా సమీక్షించారు. ఫామిలీ ఫిజిషియన్ కార్యక్రమం అనంతరం డేటా నమోదు కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మాతా శిశు మరణాలు తగ్గాలని, 9 నెలల్లో ఒక్క సారైనా గర్భిణీలకు తప్పనిసరిగా మొత్తం బాడీ పరీక్షలు జరపాలని సూచించారు.

## విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఖరీఫ్ సీజన్‌కి కావాల్సిన విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ అధికారి నీలిమ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నారు. రైతులు ఆధార్, ఫోన్ నెంబర్ తీసుకొని సంబంధిత రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారికి కావలసిన విత్తనాలను పొందాలన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని ఎం.గుమడాం పంచాయతీలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడి పంచాయతీ పరిధిలో జాబ్ కార్డులు ఎవరెవరికి కావాలో అడిగి తెలుసుకున్నారు. వెంటనే అర్హులకు జాబ్ కార్డులు అందించాలని, పని కోరిన వారికి పని కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ఎపిఒ సిహెచ్ రామారావు, సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పి మాధవ, టెక్నికల్ అసిస్టెంట్ సత్యం, అప్పలనాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-గంట్యాడ

అంగన్వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి ఆదేశించారు. గురువారం గంట్యాడలోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా అందించాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలను నేర్పి, సృజనాత్మక విషయాలను బయటకు తీయాలని చెప్పారు. సమయానికి కేంద్రాలను తెరవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఉమాభారతి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని మొయిద విజయ రాంపురంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. జంగాల వీధిలో సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనుల నిమిత్తం ఈ శంకుస్థాపన చేశారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పనులను ఇంటి ఇంటి దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అనంతరం ఆయన పూతికి పేటలో ఆరోగ్యంతో బాధ పడుతున్న శీల సత్యనారాయణను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొయిద ఎంపిటిసి పెనుమత్స సంతోష్ బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, పూతికిపేట మాజీ సర్పంచ్ యడ్ల గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళా పోలీసులు దాడులు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పోలీసులు గ్రామాల్లో పర్యటించి మహిళలపై దాడులు, గ్రామస్తులు తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. సైబర్ నేరాల పై గ్రామస్తులకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన పోలీసులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నుంచి వివిధ స్టేషన్లకు వెళ్తున్న సిబ్బందిని ఎస్ఐ సురేంద్రనాయుడు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరని, ఐతే పనిచేస్తున్న చోట చేసిన సేవలే వారి కీర్తి ప్రతిష్టలు నిలిపేందుకు దోహద పడతాయని చెప్పారు. ఇక్కడ సుదీర్ఘ కాలం పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, కానిస్టేబుల్ త్రినాధరావు విధుల్లో విశిష్ట సేవలు అందజేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు అప్పారావు, చిన్నయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయంలో రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మొదటి విడత రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లో జరుగుతాయని ఆర్డిఒ పి.శేషశైలజ ఒక ప్రకటనలో చెప్పారు. మొదటి విడత రీసర్వే బొబ్బిలి రెవెన్యూ డివిజన్‌లో 99 గ్రామాల్లో పూర్తి చేసినట్టు చెప్పారు. మెంటాడ మండలంలో 8, రామభద్రపురంలో 19, తెర్లాంలో 19, బాడంగిలో 21, బొబ్బిలిలో 20, దత్తిరాజేరులో 7, గజపతినగరంలో 5 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్టు వివరించారు. రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లో చేసుకోవాలని కోరారు.

## బేబినాయనకు సత్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయనను బ్రాహ్మణ సాధికార సమితి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ సభ్యులు గురువారం సత్కరించారు. బేబినాయన కృషితోనే తమకు కమిటీలో చోటు లభించిందని చిలకలపల్లి శ్రీనివాసరావు, బర్లి అప్పారావు తెలిపారు.

బేబినాయనను సత్కరిస్తున్న శ్రీనివాసరావు, అప్పారావు

# కౌలు రైతులను గుర్తించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలు రైతులను గుర్తించాలని తహశీల్దార్ కెవి రమణరాజు, ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓ, వీఏఏలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు కౌలు రైతులను గుర్తించాలని సూచించారు. తమకు సొంతంగా భూమి లేకపోవడంతో ఇతరుల భూములను సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించాలన్నారు. వారికి భూ సాగు హక్కు పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. కాగా భూ సాగు హక్కు పత్రాలు రైతులు సాగుచేస్తున్న పంటలను ఈ పంట నమోదు చేసుకోవచ్చని, పంట నష్ట పరిహారం, పంటల భీమా, బ్యాంక్ నుండి రుణం పొందవచ్చని పేర్కొన్నారు. రైతులకు కావాల్సిన ఇన్‌పుట్స్ ఎరువులు, పురుగు మందులు విత్తనాలు రైతు భరోసా కేంద్రం నుండి తీసుకోవచ్చున్నారు. దీని కాల పరిమితి పత్రం జారీ చేసిన తేది నుండి 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. ఈ పంట సాగుదారు హక్కు పత్రం కలిగిన సాగు దారుడు కాల వ్యవధిలో పండిన పంటపై మాత్రమే హక్కు కలిగి ఉంటాడన్నారు. భూమి పై ఎటువంటి హక్కు ఉండదని భూమి పై సర్వ హక్కులు భూమి యజమానులకు మాత్రమే చెందుతుందని తెలిపారు.

**వంగర:** కౌలు రైతులను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ డి ఐజాక్, మండల వ్యవసాయ అధికారి కస్తూరాబు తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఏ విధంగా గుర్తించాలి అన్న విషయంపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాలలో కౌలకు వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు తమ భూ యజమానుల నుండి అనుమతి పత్రం పొందిన అనంతరం తమ పేరును నమోదు చేసుకుంటే కౌలు రైతులు పంట కాలానికి సబ్సిడీ విత్తనాలు ఎరువులు పంటలు బీమా ఇన్‌పుట్ సబ్సిడీ, తమ పంటలు కొనుగోలు కేంద్రాల్లో అమ్మకం, పంటల రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎఎస్ఒ కె.ఏసుబాబు, ఆర్టికల్చర్ అధికారి సిహెచ్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

**గంట్యాడ :** ప్రతి కౌలు రైతు సిసి కార్డులు తీసుకొని ప్రభుత్వం అందించిన రాయితీలను పొందాలని వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణ్ అన్నారు గురువారం గంట్యాడ రైతు భరోసా కేంద్రంలో జరిగిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్ కుమార్ అధ్యక్షన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 839 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేశామన్నారు. కార్డులు తీసుకున్న ప్రతి కౌలు రైతుకు వ్యవసాయానికి సంబంధించిన సబ్సిడీ రాయితీలను పొందవచ్చునని అన్నారు. విత్తనాలు, ఎరువుల రాయితీలు పొందడానికి, రైతు భరోసాకు అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్డులు ఇప్పటివరకూ తీసుకోని వారు సంబంధిత విఆర్ఒలను కలిసి తీసుకోవాలన్నారు. మండలంలో 478 మంది పిఎం కిసాన్ ఇకెవైసి చేసుకోలేదని అన్నారు. సమీప మీసేవ కేంద్రంలో ఇకెవైసిలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తాహశీల్దార్ ప్రసన్న రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ.. మాట్లాడుతున్న ఎడి నాగభూషణ్

# ప్రజాభిమానం వెలకట్టలేనిది

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

తనపై ప్రజలు చూపిస్తున్న అభిమానం వెలకట్టలేనిదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. బేబినాయన జన్మదిన వారోత్సవాలలో భాగంగా రాజా కళాశాల మైదానంలో బొబ్బిలి ప్రీమియర్ లీగ్ (క్రికెట్ టోర్నమెంట్)ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై అభిమానం చూపుతున్న ప్రజలకు న్యాయం చేస్తానన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో ఉత్తరాంధ్ర నుంచి 12 టీములు పాల్గొన్నాయి. విన్నర్‌కు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.25 వేలు నగదు బహుమతి ఇస్తామని నిర్వాహకులు బొత్స అప్పులు, నంది రఘు, సందీప్ చెప్పారు.

**రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి**

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బేబినాయన కోరారు. కోటలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రక్త నిల్వలు లేకపోవడంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తం కొరతను నివారించేందుకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తదానం చేస్తే తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడమేనన్నారు. రక్తదానం చేసేందుకు రక్తదాతలు, అభిమానులు ముందుకు రావాలని కోరారు. ఆయనతో రక్తదాన శిబిరం నిర్వాహకులు గెంబలి శ్రీనివాసరావు, పువ్వల శ్రీనివాసరావు ఉన్నారు.

# పశు బీమాతో రైతులకు ప్రయోజనం

**గజపతినగరం :** వైఎస్ఆర్ పశుబీమా పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనమని జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి విశ్వేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని గంగగోళ్లపెంట గ్రామంలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు, పాముకాటు, అడవి జంతువుల వల్ల, జబ్బు చేసి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు చనిపోతే పరిహారం అందుతుందని చెప్పారు. కుటుంబానికి 5 పశువుల వరకు, సంవత్సరానికి 50 జీవాల వరకు వాటి వయసును బట్టి ఆరువేల రూపాయలు నుండి రూ.30 వేల వరకు నష్టపరిహారం లభిస్తుందని చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు మండలంలోల 30 వేల పశువులకు నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా డి-వార్మింగ్ మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిడి వై.వి.రమణ, ఎడి ఎన్.చంద్రశేఖర్, పశువైద్యాధికారులు బి.వెంకటరమణ, ఎం.శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

**వంగర :** పాడి రైతులంతా తమ పాడి పశువులకు బీమా చేయించుకోవాలని సంతకవిటి ఏడి సిహెచ్ సత్య ప్రకాష్ అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చారు. వంగర పశు వైద్య కేంద్రం నుంచి సేవలు సక్రమంగా అందడం లేదని, పెండింగ్ క్లైములు ఎప్పుడు పరిష్కరిస్తారని విలేకరులు ప్రశ్నించగా.. అక్కడ సేవలు అందించేందుకు ఒక ఇంచార్జి వైద్యునితోపాటు మరో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. పెండింగ్ క్లయమ్‌లు త్వరలోనే జమ అవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజాం ఏడి బి జయ ప్రకాష్, వంగర, ఉణుకూరు పశు వైద్యులు అనిల్, రాము, ఎల్ఎస్ఎ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## డిఆర్‌పి నియామకానికి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకం (పిఎంఎఫ్ఎంఇ)లో జిల్లా రిసోర్స్ పర్సన్ (డిఆర్‌పి) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటి కార్యనిర్వాహక సంచాలకులు జిల్లా ఉద్యానశాఖాధికారి ఎవిఎస్‌వి జమదగ్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటి (ఎపిఎఫ్‌పిఎస్) ఆధ్వర్యంలో జిల్లాలో ఇన్సెంటివ్ పద్ధతిలో పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఫుడ్ ప్రొసెసింగ్ లో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని, వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ లేదా ఏ ఇతర డిగ్రీ అయినా పూర్తి చేసి, బ్యాంకింగ్ పై అవగాహన కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌కు ఇన్సెంటివ్ పద్ధతిలో మాత్రమే ప్రయోజనం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను పోస్ట్ ద్వారా గానీ, ఈ-మెయిల్ ddhvzm@yahoo.com ద్వారా గాని పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 9573613747 లేదా, విజయనగరంలోని జిల్లా ఉద్యాన అధికారి వారి కార్యాలయం, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టరు వారి కార్యాలయ సముదాయంలో సంప్రదించాలని సూచించారు.

## ఐటిఐలో 2 కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ప్రభుత్వ ఐటిఐ స్కిల్ హబ్‌లో పిఎంకెవై 4.0లో భాగంగా రెండు ఆసక్తిగల కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ పిఎంకెవై 4.0 లో భాగంగా రెండు కోర్సులకు ఆసక్తిగల 18ఏళ్లు నిండిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఒకటి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకాగా, దీనికి కనీస అర్హత ఇంటర్‌పాసై, గుడ్ ఆప్టిట్యూడ్, గరిష్ట అర్హత ఏదైనా డిగ్రీ లేదా ఇంజనీరింగ్ కలిగి ఉండాలని తెలిపారు. రెండోది ఎలక్ట్రిషన్ డొమెస్టిక్ సొల్యూషన్స్‌కు కనీస అర్హత ఎనిమిదవ తరగతి పాసై ఉండాలని తెలిపారు. మూడు నెలల శిక్షణ అనంతరం అర్హత పొందిన అభ్యర్థికి క్యాంపస్ ప్లేస్మెంట్ ద్వారా ప్రముఖ కంపెనీలలో ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. 7780658035 నెంబరును సంప్రదించాలని కోరారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులతో ఆర్‌డిఒ చర్చలు

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించి కొత్తవలస మండలంలోని ఉత్తరాపల్లి, రాయపురాజుపేట, చిన్నిపాలెం రైతులతో ఆర్‌డిఒ ఎం.సూర్యకళ గురువారం కొత్తవలస తహశీల్దార్ కార్యాలయంలో పరిహారంపై సుదీర్ఘ సమయం చర్చలు జరిపారు. ప్రభుత్వం ఎకరాకు రూ.14 లక్షల వరకూ పరిహారం అందిస్తామని ఇదివరకు ప్రకటించింది. ప్రభుత్వం సేకరించిన సుమారు 120 ఎకరాలకు గానూ ఎకరాకు కనీసం రూ.50 లక్షల పరిహారమివ్వాలని రైతులు సింగంపల్లి గణేష్, శివ, రామకృష్ణ, ఆర్.ఆర్.కృష్ణ, పోతనాయుడు.. ఆర్‌డిఒను కోరారు. ఏళ్ల తరబడి పంటలు సాగుచేసుకుంటూ జీవిస్తున్న తమకు ఈ భూములే ఆధారమని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.3 కోట్ల విలువైన భూములు కోల్పోతే రోడ్డున పడతామని రైతులు తమ గోడు వినిపించారు. కలెక్టర్‌తో చర్చించి పరిహారంపై సమాధానం ఇస్తామని ఆర్‌డిఒ తెలియజేశారు.

మండలంలో రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్‌డిఒ అధికారులకు సూచించారు. సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, డిప్యూటీ తహశీల్దార్ రమేష్, ఆర్ఐ రాజేష్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

## పండ్ల తోటల పరిశీలన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలో నందాం, మధుపాడ పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని ఎపిడి శారదాదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 40 ఎకరాలు లక్ష్యం ఇచ్చామని, వారం రోజులలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సుందరరావు, ఇసి జోగారావు, టెక్నికల్ అసిస్టెంట్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో జగ్గయ్యపేట గ్రామంలో పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సందర్శించారు. ఈ శిబిరంలో రోగులకు డాక్టర్ ధరణి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరావు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సెంచూరియన్‌లో క్రీడా పోటీలు

**నెల్లిమర్ల :** సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఓపెన్ టోర్నమెంట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 78 జట్లు వాలీబాల్, క్రికెట్, ఫుట్ బాల్, లాన్ టెన్నిస్ డబుల్స్‌లో తలపడనున్నాయి. ఈ పోటీలను వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ప్రారంభించి మాట్లాడారు. ఓటమి కలిగినపుడు దానిని విజయానికి బాటలుగా మలచుకోవాలన్నారు. ఫుట్ బాల్, క్రికెట్ విజేతలకు ట్రోఫీతో పాటు రూ.10వేలు నగదు బహుమతి, ద్వితీయ ప్రైజ్ కింద రూ.5వేలు ప్రోత్సాహకాన్ని ఇస్తామన్నారు. లాన్ టెన్నిస్, విజేతకు రూ.5వేలు, ద్వితీయ ప్రైజ్ కింద రూ.2500 ప్రోత్సాహక బహుమతి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణ రావు, డీన్ ప్రొఫెసర్ మురళి, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి- డెంకాడ

మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని భోగాపురం సిఐ విజయానంద కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు వాడితే జీవితాలు, కుటుంబాలు నాశనం అవుతాయని చెప్పారు. మత్తు పదార్థాలు వాడినా, కలిగి ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యు. మహేష్ పాల్గొన్నారు.

## గెస్ట్‌టీచర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుతం కెజిబివి పోస్టుల భర్తీలో గెస్ట్ టీచర్లు గా పని చేస్తున్న తమకు ప్రాధాన్యత ఇచ్చి మిగిలిన ఖాళీలను కొత్తవారితో భర్తీ చేయాలని కెజిబివి గెస్ట్ టీచర్లు డిమాండ్ చేశారు. కెజిబివి పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతున్న యూత్ హాస్టల్ వద్ద గెస్ట్ టీచర్లు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గెస్ట్ టీచర్లు పి.తనూజ, ఎల్.సురిడమ్మ, బి.ఉమా మాట్లాడుతూ కెజిబివిల్లో అతి తక్కువ జీతంతో పనిచేస్తున్నామని తెలిపారు. మెరిట్ ఆధారంగా తమను ఎంపిక చేశారని, మళ్లీ ఇప్పుడు కొత్త రిక్రూట్ మెంట్ ఇచ్చి క్రొత్త ప్రాధాన్యతల ఆధారంగా, అకడమిక్ మార్క్ ఆధారంగా ఎంపిక చేయాలని నిర్ణయించారని అన్నారు. ఈ ప్రాధాన్యతల కారణంగా తాము ఉద్యోగాలను కోల్పోయి కుటుంబాలుతో రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. తమ ఉద్యోగాలు తమకు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం గెస్ట్ పీజీటి, సిటిజి లుగా సేవలు అందిస్తున్న తమకు మొదటి ప్రాధాన్య ఇచ్చి ఆ పోస్టులలో తిరిగి నియమించాలని, మిగతా ఖాళీలను కొత్త వారితో భర్తీ చేయాలని కోరారు.

## అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజారోగ్య సాంకేతికశాఖ పర్యవేక్షక ఇంజనీర్ కె. రాజారావు గురువారం పరిశీలించారు. మధుపాడ హెడ్ వాటర్ వర్క్సును సందర్శించి ఇంజనీరింగ్ సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌ల చేపడుతున్న అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, గ్యార్బేజ్ ట్రాన్సట్ స్టేషన్స్, గడప గడపకు మనప్రభుత్వం, డెవలప్మెంట్ అఫ్ పెద్ద చెరువు అభివృద్ధి పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న మంచినీటి ట్యాంకులు పనులను సంబంధిత అధికారులతో పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. వివిధ అభివృద్ధి పనుల టెండర్లు త్వరితగతిన పిలిచి పనులు పూర్తి చేయాలని సూచించారు. సామావేశంలో కె.శ్రీనివాసరావు , మున్సిపల్ ఇంజనీర్, డిఇఇ ఎస్. అప్పారావు, సహాయక ఇంజనీర్లు, పాల్గొన్నారు.

## ఎస్‌ఎఫ్‌ఐ చొరవతో 4 బడిబస్సులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నియోజకవర్గంలోని లక్కవరపుకోట, వేపాడ మండలాలకు పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం బడి బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఎస్.కోట డిపో ఎస్‌టిఐ వెంకట్రావుకు వినతి అందించారు. వెంటనే ఎస్‌టిఐ స్పందించి డిపో మేనేజర్ కె.రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం నుంచి విద్యార్థుల కోసం నాలుగు బడిబస్సులను నడుపుతామని హామీనిచ్చారు. దీంతో ఆర్‌టిసి అధికారులకు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష కృతజ్ఞతలు తెలిపారు.

## గురుకులాన్ని సందర్శించిన కోఆర్డినేటర్

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక గురుకుల పాఠశాలను జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మజ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో భోజన వసతి పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల గదులు, స్నానపుగదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి చదువు విషయంలో జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో సమావేశమై, దిశానిర్దేశం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ టిఎం ఫ్లోరెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర భూ సర్వే గ్రామసభలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది, బిటికె రాజపుర అగ్రహారం గ్రామాల్లో తహశీల్దార్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో సమగ్ర భూసర్వే గ్రామసభలను గురువారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రైతులతో తహశీల్దార్ మాట్లాడుతూ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

## మద్యం అమ్మకాలపై దాడులు

ప్రజాశక్తి-వేపాడ

కె.జి.పూడి పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఇబి సిఐ సిహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో గురువారం దాడులు చేశారు. దువ్వాడ శివ వద్ద నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. శివపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. దాడల్లో ఎస్ఐ పి.నరేంద్రకుమార్, హెచ్‌సి ఎం.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 1998 ఉపాధ్యాయులకు నేడు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డిఎస్‌సి 2008, డిఎస్‌సి 1998 కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన ఇటీవల తొలగించిన ఉపాధ్యాయులకు మళ్లీ పోసింగ్ ఇచ్చేందుకు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డిఇఒ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రింగ్‌రోడ్డులోగల పిఎస్‌ఆర్ స్కూలులో ఉదయం 8.30గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

## నవోదయకు ముగ్గురు 'హర్షవర్థన్' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గజపతినగరం

నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు స్థానిక హర్ష వర్థన స్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. బి.హనీష్ కార్తీక్, ఐ.జోష్య, ఎం.వాసికా ప్రియా ఎంపికైనట్లు స్కూలు కరస్పాండెంట్ వివి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు ఆర్‌బికె ద్వారా గురువారం వరి విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్.వెంకటరావు, ఎంపిటిసి రాజేష్, విఎఎ ఎ.కోమలి, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని ఎం సీతారాంపురం అంగన్వాడి-1,2 కేంద్రాలలో గర్భిణీ, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని సర్పంచ్ కాంబోతులు కళావతి, అంగన్వాడీ కార్యకర్తలు సునీత, పైడమ్మ గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీస్, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ఉష, ఆరోగ్య సిబ్బంది జయలక్ష్మి, ఇందిర, రత్నమాల పాల్గొన్నారు.

## 24న ఆటో వేలం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన ఆటోకు శనివారం వేలం వేయనున్నట్లు పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోకు రవాణా శాఖాధికారులు రూ.61,500 ధర నిర్ణయించారని, ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గోవాలని కోరారు.

# జగనన్న సురక్షతో మెరుగైన సేవలు

ప్రజాశక్తి-బాడంగి

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయ కన్వీనర్లకు జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకర్ సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వార గ్రామ సచివాలయ పరిధిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గౌరి, జెడ్‌పిటిసి రామారావు, తెంటు మధుసూదన్, ట్రైకార్ డైరెక్టర్ పారాది చిన్నపుదొర, నాయకులు ఆవు సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

**గజపతినగరం :** జగనన్న సురక్ష కార్యక్రమంపై గంగచోళ్లపెంట పంచాయతీలో మండల జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, ఎంఎల్ఒ ప్రసాద్, వాలంటీర్లు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల :** జగనన్న సురక్ష పథకం పక్కగా అమలు చేయాలని నగరపంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు సచివాలయం కార్యదర్శులు, వాలంటీర్లకు జగనన్న సురక్ష పథకం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం ద్వారా వివిధ సర్టిఫికేట్లను డాక్యుమెంట్లను త్వరితగతిన మంజూరు చేయడానికి సురక్ష పథకం ప్రవేశపెట్టిందన్నారు. సచివాలయం వారీగా సభలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు. కాగా వచ్చే నెల 1 నుంచి 11 రకాల సర్వీసులు సచివాలయం ద్వారా జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## రైలు కింద పడి ఉపాధ్యాయిని మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక జ్యూట్‌మిల్లు సమీపంలో రైలు కింద పడి ఉపాధ్యాయురాలు గురువారం మృతి చెందారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం కొండవెలగాడకు చెందిన కెల్ల అమ్మాజమ్మ (35) గుర్ల మండలం బెల్లానపేటలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని తన కన్న వారింటికి మొయిద వెళ్తానని చెప్పినట్లు సమాచారం. ఇంతలో విగత జీవిగా రైలు పట్టాలపై కనిపించింది. కాగా ఆమెకు భర్త, ఒక కుమారుడు ఉన్నారు. రైల్వే పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే రోడ్డు గుండా రావాల్సిన ఆమె ట్రాక్ వైపు ఎందుకు వెల్లిందో తెలియరాలేదు. ఆత్మహత్య చేసుకుందా.? ఇంకేమైనా జరిగిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని విజయనగరం నాత వలస రహదారిలో దొడ్డి బాడువా వద్ద మోటార్ సైకిల్ స్కూటీ ఎదురెదురుగా ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోగాపురం మండలం మాల నందిగామకు చెందిన పిట్ట ప్రసన్న (28) తన స్కూటీపై స్వగ్రామం నుంచి విజయనగరం వస్తుండగా విజయనగరం నుంచి నాతవలస వైపు వెళుతున్న మోటార్ సైకిల్ ఢీ కొంది. దీంతో స్కూటీ నడుపుతున్న ప్రసన్న తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారు సైకిలిస్టుకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ యు మహేష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హాట్‌మిక్స్ ప్లాంట్లో అగ్ని ప్రమాదం

రూ.4 లక్షల ఆస్తినష్టం

ప్రజాశక్తి-కొత్తవలస

విశాఖపట్నం - రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా ఎన్‌కెసి ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గులివిందాడ గ్రామంలో నిర్వహిస్తున్న హాట్ మిక్స్ ప్లాంట్‌లో గురువారం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. మంటలు అదుపు చేయలేకపోవడంతో ఎన్‌కెసి సిబ్బంది కొత్తవలస ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ ఎస్ఐ అశోక్ కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపుచేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్లాంట్‌లో ఫిల్టర్లు కాలిపోవడంతో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. ప్రమాదంలో సుమారు రూ. 4 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇంతటి విలువైన, ప్రమాదకరమైన ప్లాంట్‌ను నడుపుతూ కనీస ఫైర్ సేఫ్టీ సైతం పాటించకపోవడంపై ఎస్ఐ అసహనం వ్యక్తం చేశారు. తారు, డీజిల్ టాంకర్లు ఉన్న ఈ ప్రదేశంలో తక్షణమే ఫైర్‌సేఫ్టీ పాటించాలని ప్లాంట్ సిబ్బందికి సూచించారు.

## అదుపుతప్పి బొగ్గు లారీ బోల్తా

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రైల్వే ఫ్లైఓవర్‌పై బుధవారం రాత్రి అదుపుతప్పి బొగ్గు లారీ బోల్తా పడింది. విజయనగరం నుంచి రాయగడ వైపు వెళ్తున్న బొగ్గు లారీ ఫ్లైఓవర్‌పైకి వచ్చిన తర్వాత అదుపు తప్పడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఏమీ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా లారీని జెసిబితో తొలగించి వేరే చోటకు తరలించారు.

**IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT GAJAPATINAGARAM**
**I.A. 344/2022 in O.S.154 / 2022**
**Between:**
Gorle Ramachandra Rao
Gorle Jagadeswara Rao... Petitioners
**And:**
**Bora Laxman,** S/o. Late Ramu, R/o. Pedamanapuram Village, Dattirajeru (M), Vizianagaram Dist-535580
**Bora Bullayya** S/o. Late Pothu R/o. Pedamanapuram Village, Dattirajeru (M), Vizianagaram Dist-535580
**Bora Srinu,** S/o. Yellanna, Hindu, R/o. Pedamanapuram Village, Dattirajeru (M), Vizianagaram Dist-535580
**Bora Pydiraju,** S/o. Yellanna, R/o. Pedamanapuram Village, Dattirajeru (M), Vizianagaram Dist-535580
... Respondents No. 5, 11, 14, 15
**NOTICE**
Please take notice that the above named Petitioners has filed the injunction petiton against you and the same is stand posted to **13-07-2023 at 10-30 A.M**. for your appearance, on that day you are hereby personally or through your advcoate have to attend before the Honourable Court at 10-30 A.M. failing which the matter will be heard and deteremined in your absence as exparte as per law.
**MD.SHAREEF**
Advocate,
Visakhapatnam
Cell : 9985753810